సాక్షి ఖమ్మం

గురువారం । 29 । ఫిబ్రవరి । 2024



రూ.187.86కోట్లతో బడ్జెట్

వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.187.67 కోట్లతో కేఎంసీ బడ్జెట్‌ను రూపొందించగా కౌన్సిల్ సమావేశంలో ఆమోదించారు. 8లో



క్షణాల్లో మిర్చి నాణ్యత!

సాగు–బాగు ప్రాజెక్టు ద్వారా మిర్చి కొనుగోళ్లు చేపడుతుండగా, నాణ్యతను ఎప్పటికప్పుడు తేల్చేలా యంత్రాలను ప్రవేశపెట్టారు. 10లో



వాతావరణం

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతల తీవ్రత పెరుగుతుంది. ఉదయం నుంచే ఎండల ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

పార్లమెంటరీ కమిటీ సమావేశంలో ఎంపీ



సమావేశంలో పాల్గొన్న ఎంపీ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: న్యూఢిల్లీలోని పార్లమెంట్‌లో బుధవారం జరిగిన పార్లమెంటరీ పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ సమావేశంలో బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు పాల్గొన్నారు. కమిటీ చైర్మన్ సంతోష్‌కుమార్ గంగ్వార్ అధ్యక్షతన ఈ సమావేశం జరగగా, కాగ్ అంశాలతో పాటు మహానగర్ టెలికాం లిమిటెడ్ ఎస్టేట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం చైర్మన్‌ను ఎంపీ సన్మానించారు. కాగా, ఇప్పటివరకు పలు కమిటీ సమావేశాల్లో తాను పాల్గొని సూచనలు చేయగా, ఇది ఆఖరి సమావేశమని ఎంపీ ఓ ప్రకటనలో తెలిపారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపులో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఉద్యోగులు మరింత సమర్థవంతంగా పనిచేయాలని సీపీ సునీల్‌దత్ సూచించారు. ఖమ్మంలోని సీసీఎస్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాత కేసులు, విచారణ వివరాలపై ఆరాతీసిన సీపీ మాట్లాడుతూ పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఏర్పాటుచేయాలని తెలిపారు. నేరాలు జరిగినప్పుడు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నిందితులను అరెస్ట్ చేయడమే కాక సొత్తు రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.

కల్లూరు ఆర్డీఓగా శ్రీనివాస్

ఖమ్మం సహకారనగర్: కల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్‌డీఓ)గా కె.శ్రీనివాస్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ ఆర్డీఓగా ఉన్న ఎస్.అశోక్ చక్రవర్తిని నారాయణ్‌ఖేడ్‌కు బదిలీ చేయగా, ఆయన స్థానంలో పరకాలలో విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు వీరు నూతన స్థానాల్లో త్వరలోనే విధుల్లో చేరనున్నారు.

ఖమ్మం డీఆర్‌డీఓగా నరేష్


- భూపాలపల్లి జిల్లాకు సన్యాసయ్య

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఆర్.సన్యాసయ్యను జయశంకర్ భూపాలపల్లికి బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, భూపాలపల్లి డీఆర్‌డీఓ పి.నరేష్‌ను ఖమ్మంకు కేటాయించారు. కాగా, ఈనెల 12వ తేదీనే సన్యాసయ్య ఇక్కడ బాధ్యతలు స్వీకరించగా ఇంతలోనే బదిలీ చేయడం గమనార్హం. ఇక ఖమ్మం అడిషనల్ డీఆర్‌డీఓ పోస్టు ఖాళీగా ఉండగా.. డిప్యూటీ సీఈఓ హోదా కలిగిన బి.శిరీషను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సీడ్ డీలర్‌షిప్‌నకు అవకాశం

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఖమ్మం రీజియన్ పరిధిలో సీడ్ లైసెన్స్ కలిగి ఉన్న వ్యాపారులకు డీలర్‌షిప్ అవకాశం ఇవ్వనున్నట్లు రీజనల్ మేనేజర్ ఎన్.విక్రం తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా నాణ్యమైన విత్తనాలు విక్రయించేందుకు డీలర్ షిప్‌లు ఇస్తామని పేర్కొన్నారు. సీడ్ లైసెన్స్ కలిగిన వ్యాపారులు వివరాల కోసం 98499 08760 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎరువుల దుకాణాల్లో డీఏఓ తనిఖీ



షాపులో రికార్డులు పరిశీలిస్తున్న డీఏఓ

ఏన్కూరు: మండలంలోని తిమ్మరావుపేట, బురదరాఘవాపురం, ఏన్కూరు గ్రామాల్లోని ఎరువులు దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె షాపుల్లో రికార్డులు, గోదాంల్లో ఎరువుల నిల్వలను పరిశీలించి మాట్లాడారు. నిల్వలు, రికార్డుల్లో తేడా రావొద్దని వ్యాపారులకు సూచించారు. ఆతర్వాత ఏఈఓలతో సమావేశమైన డీఏఓ రైతుబంధు, రైతుబీమా దరఖాస్తులు పరిష్కరించాలని ఆదేశించారు. ఏఓ నరసింహారావు, ఏఈఓలు పాల్గొన్నారు.

మా డేటే సెపరేటు!

- మధుర జ్ఞాపకంగా ఫిబ్రవరి 29
- నాలుగేళ్లకోసారి వచ్చే ప్రత్యేక రోజు



లీప్ ఇయర్.. ఫిబ్రవరిలో 29రోజులు వచ్చే సంవత్సరమిది. ఈరోజు పుట్టిన వారు, పెళ్లి చేసుకున్న జంటలు నాలుగేళ్లకోసారి వేడుక జరుపుకోవాల్సిందే! సహచరులు పుట్టిన రోజు, పెళ్లిరోజు ఏటా జరుపుకుంటున్నా వీరు మాత్రం ఎదురుచూడాల్సి వస్తుంది. అయినా ప్రత్యేకంగానే భావిస్తారు. ఈ నేపథ్యాన గురువారం లీప్ ఇయర్ సందర్భంగా వేడుకలు జరుపుకోనున్న పలువురితో పాటు ముహూర్తబలం కుదరడంతో పెళ్లి చేసుకోనున్న కొన్ని జంటలపై ప్రత్యేక కథనాలు... - 8లో...

తెల్ల బంగారం మెరుపులు!

- బేల్, సీడ్ ధర పెరగడంతో పత్తికి డిమాండ్
- ప్రభుత్వ మద్దతు కంటే ఎక్కువ ధర
- రైతుల చేయి దాటాక పెరుగుతున్న ధైనం
- నిల్వ చేసిన వ్యాపారులకు సిరుల పంట



ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పత్తి

ఖమ్మంవ్యవసాయం: తెల్ల బంగారంగా పిలుచుకునే పత్తికి డిమాండ్ పెరుగుతోంది. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పత్తి ఉత్పత్తుల ధరలు పెరుగుతున్నాయి. అయితే, ఈ ఏడాది పత్తి ఆశించిన స్థాయిలో దిగుబడి రాక డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడంతో ధర పుంజుకుంటోందని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. ఈనెల రెండో వారం వరకు గరిష్టంగా పత్తి క్వింటాకు రూ.6,600 ధర పలకగా.. మూడోవారం నుంచి పెరగడం మొదలైంది. ఈమేరకు బుధవారం రూ.7,500కు చేరగా.. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గరిష్ట ధర రూ.7,020 కంటే ఎక్కువ వస్తుండడం విశేషం. గత ఏడాది ఓ దశలో పత్తి క్వింటాకు రూ.13 వేల ధర పలకగా ఆ తర్వాత పడిపోయింది. కాగా, రైతులంతా దాదాపు ఇప్పటికే పత్తి అమ్మేసుకోగా ఇప్పుడు ధర పెరుగుతుండడంతో తక్కువ ధరతో కొని నిల్వ చేసిన వ్యాపారులకే లాభం జరగనుంది.

ప్రభుత్వ మద్దతుకు మించి..

ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పత్తికి రూ.7,020 మద్దతు ధర ప్రకటించింది. కానీ సీజన్‌లో జాతీయ, అంతర్జాతయ మార్కెట్లలో ఆశించిన డిమాండ్ లేక ప్రైవేట్ వ్యాపారులు రూ.6వేల నుంచి రూ.6,500కు మించి చెల్లించలేదు. దీంతో ప్రభుత్వం సీసీఐని రంగంలోకి దింపగా తేమ శాతం ఆధారంగా కొనుగోళ్లు చేపట్టారు. ఈ సమయంలో జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయగా రైతుల కన్నా వ్యాపారులకే ప్రయోజనాన్ని చేకూర్చినట్లు ఆరోపణలు వచ్చాయి. వ్యాపారులు రైతుల వద్ద తక్కువ ధరకు పత్తి కొనుగోలు చేసి బినామీల పేరిట మద్దతు ధరతో జిన్నింగ్ మిల్లుల్లో విక్రయించినట్లు తెలిసింది.

రైతుల వద్ద సరుకు నిల్

జిల్లాలోని రైతులు దాదాపు ఇప్పటికే పత్తి అమ్మేసుకున్నారు. సీజన్‌లో ధర తక్కువగానే పలికినా చేసేదేం లేక అమ్ముకున్నారు. ఆ సమయంలో వ్యాపారులు రూ.6వేల నుంచి రూ.6,500 చొప్పున కొనుగోలు చేసి గోదాముల్లో పెద్ద ఎత్తున నిల్వ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ధరలు పెరగగా.. క్వింటా పత్తికి రూ.వెయ్యి నుంచి రూ.1,500 మేర వ్యాపారులు లాభపడుతన్నట్లు అంచనా.

బేల్, సీడ్ ధరకు అనుగుణంగా..

జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి బేళ్లు, సీడ్ ధరలు పెరిగాయి. ఫిబ్రవరి ఆరంభం వరకు బేలు(324 కిలోలు) ధర రూ.54వేలు ఉండగా, ఇప్పుడు రూ.58,500కు చేరింది. ఇక రూ.2,400గా ఉన్న సీడ్ క్వింటా ధర రూ.2,750కు పెరిగింది. దీంతో పత్తి ధర కూడా పెరుగుతోంది.

ఈ ఏడాది పత్తి ధరలు

నెల	ధర (రూ.ల్లో)
అక్టోబర్	6,900
నవంబర్	6,700
డిసెంబర్	6,400
జనవరి	6,500
ఫిబ్రవరి (ఆరంభం)	6,600
ఫిబ్రవరి (చివర)	7,500

పత్తికి డిమాండ్ పెరిగింది..



ప్రస్తుతం పత్తికి డిమాండ్ పెరిగింది. సీజన్‌తో పోలిస్తే క్వింటాకు రూ.వెయ్యి వరకు పెరిగినట్లే. ఇప్పుడు గుజరాత్, మహారాష్ట్రకు పత్తి ఎగుమతి చేస్తున్నాం. బేళ్లు, సీడ్ ధరలు పెరగగా, పత్తికి డిమాండ్ పెరిగింది.

– మన్నెం కృష్ణ, ఖరీదుదారు, ఖమ్మం మార్కెట్

కాంగ్రెస్ సన్నాహకం!

- పార్లమెంట్ ఎన్నికలకు కసరత్తు
- నేటి నుంచి అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సమావేశాలు
- మొదట రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో భేటీలు
- హాజరుకానున్న పార్టీ ఇన్‌చార్జి, మంత్రి పొంగులేటి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఉత్సాహంతో ఉన్న కాంగ్రెస్ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. త్వరలో షెడ్యూల్ విడుదలవుతుందన్న ప్రచారంతో ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలకు పార్టీ పదును పెడుతోంది. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. ఈ రెండు స్థానాల పరిధిలోని అసెంబ్లీ నియోజవర్గాల్లో దశల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా గురువారం అశ్వారావుపేట, ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గాల నేతలతో సమావేశం కానున్నారు.

గెలుపు ఇచ్చిన ఉత్సాహంతో..

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కొద్ది నెలలకే పార్లమెంట్ ఎన్నికలు రానున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది స్థానాలకు గాను మిత్రపక్షమైన సీపీఐతో కలిసి తొమ్మిది చోట్ల విజయం సాధించింది. దీంతో లోక్‌సభ ఎన్నికల్లోనూ ఈ పది నియోజకవర్గాలు కలిసి ఉన్న ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలనే ఉత్సాహంతో పార్టీ వ్యూహరచన చేస్తోంది. ఈక్రమంలోనే పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జి లను నియమించింది. ఈమేరకు ఖమ్మం, మహబూబాబాద్ స్థానాలకు మంత్రి పొంగులేటిని ఇన్‌చార్జిగా నియమించారు.

సమన్వయం చేసే దిశగా..

ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిగా ఉన్న మంత్రి శ్రీనివాసరెడ్డి నేతలందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లడంపై దృష్టి సారించారు. ఈ రెండు లోక్‌సభ నియోజవకర్గాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. నేతలతో సమావేశమవుతూ స్థానిక పరిస్థితులపై చర్చించనున్నారు. అలాగే, పార్టీ గెలుపోటములపై ప్రభావం చూపించే అంశాలను సమీక్షించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేస్తారు. నేతలందరినీ సమన్వయం చేయడమే కాక ఎన్నికలకు సిద్ధం చేసేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

నేడు రెండు చోట్ల..

రెండు పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గురువారం సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఖమ్మం లోక్‌సభ పరిధి అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ నేతల సమావేశం దమ్మపేటలో జరగనుంది. ఆ తర్వాత మహబూబాబాద్ పార్లమెంటరీ పరిధి ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశం ఇల్లెందులోని జేకే గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటలకు మొదలవుతుంది. ఈ రెండు సమావేశాల్లోనూ పార్లమెంట్ ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన వ్యూహాలను మంత్రి పొంగులేటి నేతలకు వివరిస్తారు.

నా కాన్వాయ్‌లో లైజనింగ్ వాహనాలు వద్దు..

రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మంలో తన పర్యటన సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించి ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీస్ అధికారులతో ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తన వాహన శ్రేణి(కాన్వాయ్)లో ట్రాఫిక్ పోలీసుల వాహనం తప్ప, వివిధ స్టేషన్ల నుండి వచ్చే లైజనింగ్ వాహనాలు ఉపయోగించొద్దని సూచించారు. ఆయా సిబ్బంది స్టేషన్లలో విధులు నిర్వర్తించేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏసీపీలు ఎస్‌వీ.రమణమూర్తి, శ్రీనివాసులు, సీఐలు బాలకృష్ణ, మోహన్‌బాబు, ఎస్సై రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతాం

- ఇప్పటికే నాలుగు అమల్లోకి...
- త్వరలోనే ధరణికి పరిష్కారం, అర్హులకు రేషన్‌కార్డులు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



వెంకటగిరిలో మినీ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన కలెక్టర్ గౌతమ్ తదితరులు

ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం/కూసుమంచి: ఇందిరమ్మ రాజ్యంగా ఏర్పడిన తమ ప్రభుత్వంలో ఎన్ని కష్టాలు ఎదురైనా ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుచేసి తీరుతామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో బుధవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశాక మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడిన 80 రోజుల్లోనే ఏమేం చేస్తుందో ప్రజలు చూస్తున్నారని తెలిపారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10లక్షలకు పెంచడమే కాకుండా తెల్లరేషన్ కార్డుదారులకు రూ.500కే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించామన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు రూ.2,500 పథకాలు అమలు చేస్తామని తెలిపారు. ధరణి పేరుతో గత ప్రభుత్వంలోని పెద్దలు వేలాది ఎకరాల భూమిని కబ్జా చేయడమే కాక ప్రజల దరఖాస్తులను తిరస్కరించారని చెప్పారు. ఈమేరకు తమ ప్రభుత్వం ధరణి దరఖాస్తులను పరిష్కరించడమే కాక అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇస్తామని వెల్లడించారు. కాగా, సాగునీటి ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన బీఆర్ఎస్ పెద్దలు, రూ.7లక్షల కోట్ల అప్పులు చేశారని పొంగులేటి ఆరోపించారు. కానీ ప్రాజెక్టుల తప్పిదాలను ఒప్పుకోకుండా మేకపోతు గాంబీర్యం ప్రదర్శిస్తున్నారని ఎద్దేవాచేశారు.

వెంకటగిరిలో స్టేడియం

ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరిలో రూ.2.65 కోట్ల వ్యయంతో నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియం పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధే తన లక్ష్యమని, ప్రభుత్వం నుండి ఏ పథకం వచ్చినా ముందు ఇక్కడి ప్రజలకే అందిస్తానని తెలిపారు. ఇక తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం పరిధిలోని గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో రూ.5 కోట్లతో నిర్మించనున్న భవనాలకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. అలాగే, కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో గణపేశ్వరాలయం, తీర్థాలలోని సంగమేశ్వరస్వామి ఆలయాల్లో జరగనున్న మహా శివరాత్రి ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరించి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. భక్తులు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమాల్లో కలెక్టర్ వీ.పీ. గౌతమ్, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి, ఎంపీపీలు బెల్లం ఉమ, బోడ మంగీలాల్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ, ఎంపీడీఓ శేషాద్రితో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, భైరు హరినాథబాబు, మద్దినేని బేబీస్వర్ణకుమారి, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, మద్ది మల్లారెడ్డి, బోడా వెంకన్న, కందుకూరి వెంకటనారాయణ,రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, బోడపట్ల సునీత తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

'మాదిగ జోడో యాత్ర'లో నాయకులు



పిడమర్తి రవిని సన్మానిస్తున్న జేఏసీ నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: తెలంగాణలో అతిపెద్ద కులంగా ఉన్నందున మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించడమే కాక 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ పిడమర్తి రవి, తెలంగాణ మాదిగ రాజకీయ పోరాట వేదిక చైర్మన్ వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మాదిగ జోడో యాత్ర బుధవారం ఖమ్మం సమీపంలోని కొత్తూరులో కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగలకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వడమే కాక నామినేటెడ్ పదవుల్లోనూ 75 శాతం కేటాయించాలని కోరారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రిజర్వ్‌డ్ స్థానాల్లో రెండు, జనరల్‌లో ఒక సీటు మాదిగలకు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లాలో 1978 నుంచి మాదిగలకు ఎమ్మెల్యే పదవి కానీ, నామినేటెడ్ పదవి కాని కేటాయించనందున ఈసారైనా ప్రాధాన్యత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కాగా, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఓటమే లక్ష్యంగా మాదిగలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ యాత్రలో నాయకులు జి.మల్లికార్జున్, ఎం.నర్సింగరావు, మోదుగు జోగారావు, నెమలి కిషోర్, ప్రవీణ్, క్రాంతి, సురేష్, నరేష్, గణేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'సుడా' పనులపై విజిలెన్స్

- కేఎంసీలో రికార్డులను పరిశీలించిన అధికారులు
- విజిలెన్స్ ఏఎస్పీ ఆధ్వర్యాన నాలుగు బృందాలతో తనిఖీ
- కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం



ఇంజనీరింగ్ అధికారుల నుండి వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) ఆధ్వర్యాన గత రెండేళ్లలో నిర్వహించిన పలు అభివృద్ధి పనులపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. వరంగల్ నుంచి బుధవారం విజిలెన్స్ ఏఎస్పీ బాలకోటి ఆధ్వర్యాన వచ్చిన అధికారుల బృందం పలు పనులకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించింది. ప్రతీ పని వివరాలు, బిల్లులపై అధికారులను ఆరా తీశారు. ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయే వరకు ఈ తనిఖీలు కొనసాగాయి.

అధికారులతో సమీక్ష

విజిలెన్స్ ఏఎస్పీ బాలకోటి ఆధ్వర్యాన వచ్చిన ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో కూడిన 20 మంది బృందం కేఎంసీలో తొలుత కమిషనర్ ఆదర్శ్ సురభి, ఇంజనీరింగ్ పబ్లిక్ హెల్త్ అధికారులతో సమావేశమయ్యారు. సుడా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలతోపాటు ఎంపిక చేసిన పనుల రికార్డులు తీసుకున్నారు. ఏయే పనులకు ఎంత వెచ్చించారు, పనులు పూర్తయ్యాక తనిఖీ చేసిన అధికారులెవరు, బిల్లులు ఆమోదించింది ఎవరనేది ఆరా తీశారు. ప్రధానంగా పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్ అధికారులతో విజిలెన్స్ అధికారులు పలు దఫాలుగా సమీక్ష నిర్వహించారు.

నాలుగు బృందాలుగా..

విజిలెన్స్ అధికారులు నాలుగు బృందాలుగా విడిపోయి తనిఖీలు చేపట్టారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో కూడా ఈ బృందాలు తనిఖీలు చేసి సుడా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల రికార్డులు పరిశీలించినట్లు తెలిసింది. మిగిలిన అధికారులంతా కేఎంసీలోనే రికార్డుల తనిఖీల్లో నిమగ్నమయ్యారు. ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్ ఆధ్వర్యానగత రెండేళ్లలో జరిగిన పనులతోపాటు కొత్త బస్టాండ్, గోళ్లపాడు చానల్ నిర్మాణ పనులే కాక రఘునాథపాలెం మండలం, మధిర నియోజకవర్గాల్లో జరిగిన పనుల రికార్డులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో కేఎంసీ పరిధిలోనే కాక చుట్టుపక్కల గ్రామాల్లో సుడా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై విజిలెన్స్ అధికారులు ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జనవరిలో థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఉద్యోగులు చేసిన తనిఖీల్లో సుడా నిధులతో నిర్మించిన రోడ్లలో నాణ్యత లోపించిందని గుర్తించారు. ఇదే విషయంపై విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు అందగా, తనిఖీలకు వచ్చినట్లు తెలుస్తోంది.

డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నాం..



ఖమ్మంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో పీఆర్, కార్పొరేషన్, పబ్లిక్ హెల్త్ ఆధ్వర్యంలో జరిగిన పనులకు సంబంధించిన రికార్డులతో పాటు కొత్త బస్టాండ్ నిర్మాణ పనుల రికార్డులను పరిశీలిస్తున్నాం. పరిశీలన పూర్తయ్యాక క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తాం. రోడ్లు, ఇతర నిర్మాణాల శాంపిల్స్‌ను సేకరించి నాణ్యతను పరీక్షించనున్నాం.

– బాలకోటి, అడిషనల్ ఎస్పీ, విజిలెన్స్, వరంగల్

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

తొలిరోజు ప్రశాంతంగా సాగిన పరీక్ష



పెండిప్రోలు కళాశాలలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కాగా, తొలిరోజు ప్రశాంతంగా పరీక్ష ముగిసింది. జిల్లాలో 19,499 మంది విద్యార్థులకు గాను 18,599మంది హాజరుకాగా, 900మంది గైర్హాజరయ్యారు. పలు కేంద్రాలను కలెక్టర్ గౌతమ్ సహా అధికారులు పరిశీలించారు.

- ఖమ్మం సహకారనగర్ - 8లో...

మా డేటే సెపరేటు!

నాలుగేళ్లకోసారి వచ్చే ప్రత్యేక తేదీ

- లీప్ ఇయర్‌లో పుట్టినరోజు, పెళ్లి వేడుకలు ప్రత్యేకం
- వేడుకలకు సిద్ధమవుతున్న పలువురు..



ఖగోళ సంవత్సరంతో.. క్యాలెండర్‌లో వచ్చే తేడాను సరి చేయడానికి లీప్ సంవత్సరం అమల్లోకి వచ్చింది. భూమి సూర్యుడి చుట్టూ తిరగడానికి 365 రోజులకు తోడు మరో ఆరు గంటలు అదనంగా సమయం పడుతుంది. ఇలా ఆరు గంటల చొప్పున నాలుగేళ్లకు ఒక రోజు అవుతుంది. దీంతో ఈ రోజును కలిపి నాలుగేళ్లకోసారి ఫిబ్రవరిలో 29వ తేదీని ప్రవేశపెట్టినలీప్ సంవత్సరానికి పిలుచుకుంటున్నాం. ఈ రోజును పలువురు ప్రత్యేకంగా భావిస్తున్నారు. ఇదేరోజు పుట్టిన వారు పుట్టిన రోజును, పెళ్లి చేసుకున్న వారు వార్షికోత్సవాన్ని నాలుగేళ్లకోసారి జరుపుకోవాల్సి ఉంటుంది. అందుకే ప్రత్యేకంగా భావిస్తూ నేడు(గురువారం) వేడుక వినూత్నంగా, ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇక ఈ ఏడాది ఫిబ్రవరి 29న మంచి ముహూర్తం ఉండడంతో పలువురు తమ జీవితంలో జ్ఞాపకంగా భద్రపర్చుకోవాలనే భావనతో పెళ్లి చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నాయి. ఈమేరకు లీప్ సంవత్సరంలో పుట్టిన రోజు, వివాహ వార్షికోత్సవం జరుపుకుంటున్న వారి వివరాలతో కథనం... – ఖమ్మంగాంధీచౌక్ / సత్తుపల్లిటౌన్ / నేలకొండపల్లి

నా పుట్టిన రోజు నాలుగేళ్లకోసారి..



నేను ఫిబ్రవరి 29న జన్మించడంతో అమ్మానాన్నలు కల్యాణ్ కుమార్–శ్రీలక్ష్మి నాలుగేళ్లకోసారి పుట్టిన రోజు ఘనంగా నిర్వహించే వారు. నాలుగేళ్ల వయసులో నాలుగు కిలోలు, ఎనిమిదేళ్ల ఎనిమిది కిలోలు, 12 ఏళ్ల వయసులో 12 కిలోల కేక్ కట్ చేశా. అలా ప్రతీసారి నాలుగు కేజీలు పెంచుతూ వెళ్తున్నాం. నేషనల్ బాస్కెట్ బాల్ చాంపియన్‌గా గుర్తింపు పొందిన నేను ప్రస్తుతం శ్రీబాలాజీ ఎస్టేట్‌లో బోర్డు డైరెక్టర్‌గా ఉన్నా.

– అదపా శ్రీనాగ హర్ష, ఖమ్మం

స్టెప్పుల కేక్‌తో సందడి



నాలుగేళ్లకోసారి నా పుట్టిన రోజును అమ్మానాన్నలు రవి – సుకన్యతో పాటు బంధువులు, స్నేహితులతో కలిసి జరుపుకుంటా. నేను ఇప్పుడు ఆరో తరగతి చదువుతుండగా, 12వ జన్మదిన వేడుకలకు స్టెప్పుల కేక్‌ను సిద్ధం చేశారు. కేక్ కట్ చేయడమే కాక మా సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో స్నేహితులంతా శుభాకాంక్షలు చెబుతారు. నాలుగేళ్లకోసారి పుట్టిన రోజు జరుపుకునే నన్ను పాఠశాలలో ప్రత్యేకంగా చూస్తారు.

– అస్మిత, ఖమ్మం

ఘనంగా జరిపించేలా...

సత్తుపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన బత్తుల తిరుపతిరావు, వెంకటలక్ష్మి కుమారుడు లివియాన్స్ 2020 ఫిబ్రవరి 29న జన్మించాడు. ప్రస్తుతం ఆయన సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యాలయంలో యూకేజీ చదువుతున్నాడు. లివియాన్స్ జన్మించిన నాలుగేళ్లయినా ఇదే గురువారం మొదటి పుట్టిన రోజు కావడంతో బంధువులు, కుటుంబ సభ్యుల నడుమ ఘనంగా నిర్వహించేందుకు తల్లిదండ్రులు సిద్ధమయ్యారు.



పుట్టిన రోజులు పద్నాలుగే..



సత్తుపల్లిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నా. ప్రస్తుతం నా వయస్సు56 సంవత్సరాలు. 1968 ఫిబ్రవరి 29వ తేదీన జన్మించడంతో ఇప్పటివరకు14 పుట్టిన రోజులు మాత్రమే జరుపుకున్నాను.. లీప్ ఇయర్ వస్తుందంటేనే ఆనందంగా ఉంటుంది. స్నేహితులు, బంధువులు కూడా నా పుట్టినరోజున ప్రత్యేకంగా శుభాకాంక్షలు చెప్పడం మరిచిపోలేని సంతోషాన్ని ఇస్తుంది.

– కోవెల సుధామాధవి, సత్తుపల్లి

ఎంతో స్పెషల్‌గా..



సత్తుపల్లిలోని టాలెంట్ స్కూల్‌లో యూకేజీ చదువుతున్న చాణక్యల కరుణాకర్ తల్లిదండ్రులు మురళి – శిరీష. వేంసూరు మండలం భీమవరానికి చెందిన వీరికి 2020 ఫిబ్రవరి 29వ తేదీన కరుణాకర్ జన్మించాడు. నాలుగేళ్లకోసారి పుట్టిన రోజు వస్తుండడంతో స్పెషల్‌గా భావించి ఘనంగా నిర్వహిస్తారు. ఈసారి కూడా కరుణాకర్ స్నేహితులతోపాటు బంధువుల నడుమ వేడుకగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

ముహూర్తబలం!

నాలుగేళ్లకోసారి వచ్చే రోజే కాదు మంచి ముహూర్తం కూడా ఉంది! ఇంకేముంది పలువురు ఈరోజు వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. గురువారం లీప్ ఇయర్ కావడంతో పాటు వివాహానికి బలమైన ముహూర్తం ఉందని పండితులు చెబుతున్నారు. దీంతో ఇదేరోజు ఒక్కటయ్యేందుకు పెద్దసంఖ్యలో జంటలు ఏర్పాట్లు చేసుకున్నాయి. కాగా, ఈరోజు పెళ్లి చేసుకునే వారు మళ్లీ నాలుగేళ్ల తర్వాత అంటే 2028లోనే మొదటి వివాహ వార్షికోత్సవం జరుపుకోవాల్సి ఉంటుంది. ఈ రోజు వివాహం చేసుకోనున్న కొందరి వివరాలిలా ఉన్నాయి. మధిరకు చెందిన తూములూరి తనుష్‌కుమార్‌కు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన మారం సృజనతో, చింతకాని మండలం రామకృష్ణాపురానికి చెందిన దేవరపల్లి రామతులసితో వేంసూరు మండలం యర్రగుంటపాడుకు చెందిన గద్దం హేమంత్ కృష్ణారెడ్డితో, ఖమ్మంకు చెందిన బానోత్ అశోకరాణితో మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ధరావత్ తండాకు చెందిన ధరావత్ వెంకటేశ్వర్లుతో, నేలకొండపల్లికి చెందిన గరిడేపల్లి వంశీకి సూర్యాపేట జిల్లా కోమరబండకు చెందిన చట్టు బిందుతో వివాహం జరగనుంది.



క్లుప్తంగా

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించండి



మాట్లాడుతున్న డీడీ సత్యనారాయణ

ఖమ్మంమయూరిసెంటర్: వసతిగృహాల్లో పనిచేస్తున్న సంక్షేమ అధికారులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ సూచించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ఎస్సీ సంక్షేమ వసతిగృహ అధికారులకు ఖమ్మంలోని టీటీడీసీ భవనంలో ఏర్పాటుచేసిన రెండు రోజుల అవగాహన సదస్సు బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవతో ఈ కార్యక్రమాన్ని చేపడుతోందని, వసతి గృహాల్లోని విద్యార్థులను మానసిక స్థితిని గుర్తించి ఒత్తిడి తొలగించేలా సంక్షేమాధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పరీక్షల వేళ మరింత శ్రద్ధ వహిస్తూ విద్యార్థుల్లో భయాలు తొలగించాలని, ఒత్తిడి లేకుండా పరీక్ష రాసేలా తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. అనంతరం వ్యక్తిత్వ వికాస నిపుణులు అట్లూరి వెంకటరమణ మాట్లాడగా, ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ రీజనల్ ట్రైనింగ్ మేనేజర్ వి.ఆనంద్ కుమార్, ఏఎస్‌డబ్ల్యూఓలు శ్రీలత, కొత్త వెంకటేశ్వరరావు, శివభాస్కర్‌రావు, లక్ష్మణరావు, డీడీ కార్యాలయ ఉద్యోగులు వేముల శంకర్, ఎం.డీ.ఫాతిమా, హెచ్‌డబ్ల్యూఓ ఫోరం జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు పాల్గొన్నారు.


నేరాల నియంత్రణకు విస్తృతంగా తనిఖీలు

ఖమ్మంక్రైం: చట్టవ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు పోలీస్ యంత్రాంగం విస్తృత తనిఖీలు నిర్వహిస్తోంది. సీపీ సునీల్‌దత్ ఆదేశాల మేరకు సరిహద్దు రాష్ట్రాల మీదుగా గంజాయి, రేషన్ బియ్యం, ఇసుక అక్రమ రవాణాను జరగకుండా చూసేందుకు రాత్రివేళ వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. ఈసందర్భంగా సరైన ధృవీకరణ పత్రాలు లేని వాహనాలపై కేసులు నమోదు నమోదు చేయడమే కాక మితిమీరిన వేగంత వెళ్లే వారు, మద్యం సేవించి వాహనాలు నడిపే వారితో పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. గత రెండు నెలల వ్యవధిలో 4,822 ఈ–పిటీ కేసులు నమోదు చేయగా, 1,014 కేసుల్లో నిందితులకు న్యాయస్థానం జరిమానా విధించిందని పోలీసులు ఓ ప్రకటనలో వెల్లడించారు. అలాగే, దొంగతనాలు జరగకుండా చూడడం, పాత నేరస్తుల కదలికలను కట్టడి చేసేందుకు గాను తనిఖీలు ముమ్మరం చేశామని తెలిపారు.

వచ్చేనెల 2న యూనియన్ బ్యాంకు ఎక్స్‌పో

ఖమ్మంగాంధీచౌక్: వచ్చేనెల 2న యూనియన్ బ్యాంకు ఆధ్వర్యాన రిటైల్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు రీజనల్ హెడ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ హన్మంతరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో బిల్డర్లు, కార్ల డీలర్లు, విద్యాసంస్థల ప్రతినిధులు, వీసా కన్సల్టెంట్లు, సోలార్ రూఫ్ టాప్ డీలర్లు పాల్గొంటారని పేర్కొన్నారు. అర్హులైన వారికి బ్యాంకు ద్వారా రుణాలకు సంబంధిం మంజూరు లేఖలు అందిస్తామని తెలిపారు. ఈమేరకు ఖమ్మం బైపాస్‌లోని దోరేపల్లి ఫంక్షన్ హాల్‌లో జరిగే ఎక్స్‌పోను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాము కాటుతో మహిళ మృతి



మహాదేవ కుమారి (ఫైల్)

సత్తుపల్లిరూరల్: మండలంలోని బుగ్గపాడుకు చెందిన మహాదేవ కుమారి(42) బుధవారం పాము కాటుకు గురై మృతి చెందింది. మొక్కజొన్న తోటలో పనికి వెళ్లిన ఆమెను పాము కాటు వేయగా, సత్తుపల్లిలోనిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగానే పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. కుమారికి భర్త వీరభద్రాచారి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైతుకు పాముకాటు..

కామేపల్లి: వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన ఓ రైతును పాము కాటు వేసింది. కామేపల్లి మండలం పండితాపురానికి చెందిన జంగా నారాయణరెడ్డి మిర్చి తోటలో ఉండగా, కాలిపై పాము కాటు వేయడంతో కుటుంబీకులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మధిర: రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన జంటలో మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. చింతకానికి చెందిన శ్రీలక్ష్మి (24)కి గతంలోనే వివాహం జరగగా, సమీప బంధువైన సాయికృష్ణతో ఫోన్‌లో మాట్లాడుతుండడంతో కుటుంబీకులు మందలించారు. దీంతో ఆమె, సాయికృష్ణ మంగళవారం మధిర సమీపాన రైలు కింద పడగా తీవ్రగాయాలయ్యాయి. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతన్న శ్రీలక్ష్మి (24) బుధవారం మృతి చెందిందని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఇదేఘటనలో తీవ్ర గాయాలైన సాయికృష్ణ పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలిసింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,595

రూ.187.86 కోట్లతో కేఎంసీ బడ్జెట్

- ప్రతిపాదనలను ఆమోదించిన కౌన్సిల్
- 17 మంది కార్పొరేటర్లు గైర్హాజరు
- తాగునీటి ఎద్దడిపై దృష్టి సారించాలని ఎమ్మెల్సీ మధు సూచన



బడ్జెట్ వివరాలు వెల్లిస్తున్న అధికారి, చిత్రంలో మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అంచనా బడ్జెట్‌కు ఆమోదం లభించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను సవరించి వచ్చే ఆర్థిక సంవత్సరం ఆదాయ, వ్యయ అంచనాలతో బడ్జెట్‌ను రూపొందించగా.. మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ప్రవేశపెట్టారు. రూ.187.86 కోట్లతో అంచనా బడ్జెట్‌ను ప్రతిపాదించగా, ఇందులో రూ.80.67 కోట్లు సొంత ఆదాయంగా చూపించారు. ఇక ప్రణాళికేతర, ప్రణాళిక, ఇతర నిధులు రూ.101.44 కోట్లతో మరికొన్ని నిధులు వస్తాయని ప్రతిపాదనల్లో పొందుపర్చారు. బడ్జెట్ వివరాలను అకౌంట్ ఆఫీసర్ శివలింగం వెల్లడించగా కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు.

కార్పొరేటర్ల గైర్హాజరు

కేఎంసీలో కీలకమైన బడ్జెట్ సమావేశానికి గతంలో ఎన్నడూ లేని విధంగా 17 మంది కార్పొరేటర్లు గైర్హాజరయ్యారు. ప్రస్తుత పాలక వర్గం ఏర్పడ్డాక మొత్తం 10 సమావేశాలు జరగగా, రెండు బడ్జెట్ సమావేశాలు ఉన్నాయి. అన్ని సమావేశాలకు ఒకరిద్దరు మినహా.. అందరూ హాజరయ్యేవారు. కానీ బుధవారం నాటి బడ్జెట్ సమావేశానికి 17 మంది కార్పొరేటర్లు హాజరు కాలేదు. ఒకరిద్దరు వ్యక్తిగత పనులపై రాకపోగా, మిగతా వారు ఎందుకు రాలేదనే చర్చ జరుగుతోంది. ఇక సమావేశం అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులకు, సిబ్బందికి భోజనాలు ఏర్పాటు చేయగా అందరికీ సక్రమంగా అందకపోవడంతో పలువురు తప్పుపట్టారు.

సమస్యలను పరిష్కరించండి : ఎమ్మెల్సీ మధు

బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ కేఎంసీ పరిధిలో ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కార్యాలయం చుట్టూ తిరగకుండా చూడాలని, వేసవిలో తాగునీటి సమస్య రాకుండా పర్యవేక్షించాలని తెలిపారు. పలువురు కార్పొరేటర్లు మాట్లాడుతూ నగరంలో కుక్కల సమస్య రోజురోజుకు పెరుగుతున్నందున పరిష్కరించాలని కోరారు. ఇంకా ఇంటి నిర్మాణ అనుమతులు, టౌన్‌ప్లానింగ్, ఆదాయం తదితర సమస్యలను కూడా ప్రస్తావించారు. ఈ సమావేశంలో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

సాధారణ కాన్పుల సంఖ్య పెరగాలి

కలెక్టర్ వీ.పీ.గౌతమ్



తిరుమలాయపాలెం సీహెచ్‌సీలో పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంవైద్యవిభాగం: ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పుల కంటే సిజేరియన్ల ద్వారానే కాన్పులు ఎక్కువగా జరుగుతున్నందున వీటిని తగ్గించేందుకు వైద్యులు కృషి చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం ప్రైవేట్ ప్రసూతి వైద్యులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులు పెరుగుతుంటే, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లు చేయడం ఏమిటని ప్రశ్నించారు. గర్భిణులు, వారి కుటుంబీకులకు సాధారణ కాన్పులతో ప్రయోజనాలను వివరించాలని సూచించారు. వచ్చేనెలలో ఈ విషయమై మార్పు కనిపించాలని స్పష్టం చేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.సుబ్బారావు మాట్లాడగా వైద్యులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ గౌతమ్ వైద్యాధికారులను ఆదేశించారు. సీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆయన వైద్యుల హాజరు పట్టిక, ల్యాబ్, ప్రసూతి వార్డు, ఎమర్జెన్సీ సేవల వార్డులను పరిశీలించి ఇన్‌చార్జ్ డాక్టర్ కృపా ఉషశ్రీతో పలు అంశాలను ఆరా తీశారు. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా 100 పడకల ఆస్పత్రిగా మార్చినందున విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు. వైద్యులు బొల్లికొండ శ్రీనివాసరావు, సురేష్, సిబ్బంది నర్సింహారావు పాల్గొన్నారు.

మరోసారి సీఐల బదిలీలు

ఖమ్మంక్రైం: జిల్లాలో ఇటీవలే సీఐల బదిలీ జరగగా, మరోమారు బదిలీ చేస్తూ ఐజీ రంగనాథ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం వీఆర్‌లో ఉన్న అశోక్‌ను భద్రాద్రికొత్తగూడెం జిల్లా అశ్వాపురం సీఐగా, సీసీఎస్ సీఐ–2గా పనిచేస్తున్న బి.సత్యనారాయణను వీఆర్‌కు కేటాయించారు. అలాగే, కొత్తగూడెం త్రీటౌన్ సీఐ ఓ.మురళిని ఖమ్మం సీఎస్‌బీ–1 సీఐగా, సీఎస్‌బీలో పనిచేస్తున్న జితేందర్ అశ్వారావుపేట సీఐగా బదిలీ చేస్తూ ఉత్వర్వులు విడుదలయ్యాయి.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు ప్రశాంతంగా సాగిన పరీక్ష
- నిమిషం నిబంధనతో ముందుగానే వచ్చిన విద్యార్థులు



చివరి నిముషంలో పరుగున వస్తున్న విద్యార్థిని



ఖమ్మంలోని పరీక్ష కేంద్రం వద్ద నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 70 కేంద్రాలకు గాను 19,499 మంది విద్యార్థుల్లో 18,599మంది హాజరయ్యారు. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. ఏర్పాట్లపై ఆరా తీసిన ఆయన సీసీ కేంద్రాల పనితీరును పరిశీలించి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుకు సూచనలు చేశారు. అలాగే, ఇంకొన్నికేంద్రాలను డీఐఈఓ కె.రవిబాబు, హైపవర్ కమిటీ, డీఈసీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. విద్యార్థులు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతో పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని డీఐఈఓ రవిబాబు వెల్లడించారు. కాగా, ఓ విద్యార్థికి వెలుగుమట్ల సమీపాన శ్రీ చైతన్య కళాశాలలో సెంటర్ కేటాయించగా, ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ ఎదురుగా చైతన్య కళాశాలకు వచ్చాడు. అక్కడి సిబ్బంది ద్వారా తెలుసుకున్న ఆయన మళ్లీ వెలుగుమట్ల సమీపంలోని కళాశాలకు వెళ్లేసరికి సమయం ఉండడంతో ఊపిరి పీల్చుకున్నాడు.

ముందస్తుగానే కేంద్రాలకు..

కేంద్రాల్లోకి విద్యార్థులను గంట ముందు నుంచే అనుమతిస్తామని, నిర్ణీత సమయానికి నిమిషం ఆలస్యమైనా రానివ్వబోమని అధికారులు వెల్లడించడంతో విద్యార్థులు ముందుగానే చేరుకున్నారు. కొన్నిచోట్ల మాత్రం విద్యార్థులు ఉరుకులు, పరుగులపై రావడం కనిపించింది. కాగా, పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు మూసి వేయించడంతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. కాగా, ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద మార్చి 16వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సీపీ సునీల్ దత్ ఓ ప్రకటనలో తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

- చెరువుమాదారం చెరువులో తేలిన మృతదేహం
- కొట్టి చంపారని కుటుంబ సభ్యుల ఆరోపణ



ఆందోళనకు దిగిన వారితో మాట్లాడుతున్న పోలీసులు



శివ (ఫైల్)

నేలకొండపల్లి: ఓ యువకుడు చెరువులో మృతదేహమై తేలగా.. ఒంటిపైగాయాలు ఉండడంతో కొట్టి చంపారని కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. చెరువులో చేపల కోసం వెళ్లే కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన సిబ్బందే కొట్టి చంపి ఉంటారని గ్రామస్తులు ఆరోపిస్తుండడంతో నేలకొండపల్లి మండలం చెరువుమాదారంలో ఉద్రిక్తత నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చెరువుమాధారం చెరువులో బుధవారం ఉదయం గ్రామానికి చెందిన దాసరి శివ(23) మృతదేహం లభించింది. చెరువులో ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు చెందిన పలువురు చేపల లూటీకి దిగగా, శివ కూడా వెళ్లినట్లు సమాచారం. కాగా, చెరువు కాంట్రాక్టుకు తీసుకున్న వ్యక్తి తన వ్యక్తులను రంగంలోకి దింపగా గా కర్రలతో కాపలా కాస్తున్నట్లు తెలిసింది. ఈక్రమంలోనే శివపై దాడి చేశారని కుటుంబీకులు ఆరోపిస్తుండగా, ఆయన శరీరంపై గాయాలు ఉండడంతో ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. కాగా, శివ మృతదేహం చెరువులో దాదాపు రెండు కిలోమీటర్ల లోపల ఉండగా, గ్రామానికి చెందిన ఈవూరి శ్రీనివాసరెడ్డి చొరవతో నాటు పడవపై వెళ్లి ఒడ్డుకు చేర్చారు.

ఐదు గంటల పాటు ఉద్రిక్తత

చెరువుమాధరం చెరువులో శివ మృతికి కారణాలు గుర్తించి బాధ్యులను అరెస్ట్ చేయాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. పెద్దసంఖ్యలో చెరువు కట్టపై ఆందోళనకు దిగగా ఇన్‌చార్జ్ సీఐ రాజిరెడ్డి, ఎస్సై చేరుకుని వివరాలు సేకరించారు. చేపల వేట సాగించే నిర్వాహకులే కారణమని ఆరోపించగా, మంగాపురంతండా–చెరువుమాధారం గ్రామస్తుల నడుమ వివాదం చోటు చేసుకుంది. దాదాపు ఐదు గంటల పాటు ఆందోళన కొనసాగగా, రెండు గ్రామాల పెద్దలు చర్చించి శివ కుటుంబానికి పరిహారం చెల్లించినట్లు సమాచారం. కాగా, ఘటనపై శివ కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట నాగరాజు తెలిపారు.

శ్రీవిశ్వధర్మ క్షేత్రంలో వైభవంగా ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: శివనామస్మరణతో సత్తుపల్లి మండలం బుగ్గపాడు మార్మోగింది. సిద్ధాంతి వెల్లటూరి ప్రసాదాచారి ఆధ్వర్యాన నిర్మిస్తున్న శ్రీ విశ్వధర్మక్షేత్రంలో వేదమంత్రాలు, మేళతాళాల నడుమ అన్నపూర్ణసహిత మోక్షరుద్రేశ్వరస్వామి, దండి గణపతి, వల్లీదేవసేన సహిత సుబ్రమణ్యస్వామి, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా జరిగింది. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆతర్వాత హరిద్వార్ నాగసాధువులచే ప్రతిష్ఠాపన జరగగా, సుమారు ఐదువేల మంది భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో పండితులు తియ్యబిండి కల్యాణకుమార్ ఆచార్యులు, అత్తలూరి బాలశంకర్‌శాస్త్రి, గోసుగుంట నాగేశ్వరశర్మ, బొడ్డు శివ, తుమ్మూరు శ్రీరాంప్రసాద్, మారగాని శ్రీనివాసరావు, వెల్లటూరి పవన్, రామడుగు గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



గురువయ్య (ఫైల్)

తిరుమలాయపాలెం: పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితుల్లో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని పిండిప్రోలుకు చెందిన కుమ్మరి గురువయ్య(30) పదెకరాల భూమి కౌలుకు తీసుకుని మిర్చి, పత్తి పంటలు సాగు చేశాడు. తెగుళ్ల కారణంగా దిగుబడి రాకపోవడంతో అప్పులు తీర్చే పరిస్థితి కానరాలేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన మంగళవారం పురుగుల మందు తాగగా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో వృద్ధుడు..

పెనుబల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పెనుబల్లి మండలం పార్థసారథీపురానికి చెందిన పద్దం సోములు(71) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్నా నయం కావడం లేదు. దీంతో మంగళవారం పురుగుల మందు తాగిన ఆయనను ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR

- For Discontinued (or) Fail ఇంటర్, డిగ్రీ, పి.జి, LL.B, B.Tech, M.Tech, MBA, B.Sc, M.Sc, అగ్రికల్చర్, Ph.D (All). 7013038197. [W-1220989]

Real Estate

TO - LET

- ఖమ్మంలో ఫ్లాట్ నెం. G5, వరదయ్య టవర్స్, మమత హాస్పిటల్ రోడ్, ముగ్గా షాపు ఎదురుగా ఉన్న ఇల్లు అద్దెకు ఇవ్వబడును. 8074167776, 9959077678. [M-1233861]

Services

BUSINESS OFFER

- ద్వారక ఎంటర్‌ప్రైజ్: పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్ పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం. ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం ✆ 9310515624, 8800496710 [G-1438]

Wanted

- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9059663584. [M-1233860]
- షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడి సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, వాచ్‌మెన్‌లు, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-13601]
- మార్చి మొదటి వారంలో అమెరికా వెళుతున్న మాకు ఇంటి, వంట పనులు చేయుటకు ఆడమనిషి కావలెను. అమెరికా విజిటింగ్ వీసా కలిగిన వారు మాత్రమే సంప్రదించగలరు. ✆ 92904 15199 [B-790486]
- హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ: 18k ఫోన్: 9640258899 / 9640468899 [H-793696]
- రామకృష్ణ గ్రూపు, (AP, న్యూ ఢిల్లీ No.1) శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, ఇంటి / వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ + జీ: 15-18 వేలు, ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 92814 52843, 92814 52838 [B-1239086]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	9705444182
	9010299957
కొత్తగూడెం	9010223783
పాల్వంచ	9705444183
భద్రాచలం	9951602914
మణుగూరు	9705944416

క్లుప్తంగా...


సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ సీనియర్ నేత సూర్యారావు

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ సీనియర్ నేత గొల్లపల్లి

సాక్షి, అమరావతి/విజయవాడ స్పోర్ట్స్: టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, పి.గన్నవరం టీడీపీ నేత నేలపూడి స్టాలిన్ బాబు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారు బుధవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి సీఎం వైఎస్ జగన్ పార్టీ కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పి.వి.మిథున్‌రెడ్డి, ఎంపీ కేశినేని నాని పాల్గొన్నారు. అనంతరం సీఎం క్యాంపు కార్యాలయం వద్ద గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్‌లనుద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ పెత్తందార్లకు అనుకూలంగా, దళిత వర్గాలకు, సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా ఉందని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్ టీడీపీ నేతలు, కార్యకర్తల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

ఒంగోలు లోక్‌సభ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా చెవిరెడ్డి

- మరో ఐదుగురు పార్టీ సమన్వయకర్తల నియామకం
- గుంటూరు లోక్‌సభకు కిలారి రోశయ్య



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో రెండు పార్లమెంటు స్థానాలకు, మూడు శాసన సభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను నియమిస్తూ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. పార్టీ సమన్వయకర్తల ఎనిమిదో జాబితాలో ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గానికి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని, గుంటూరు లోక్‌సభ నియోజకవర్గానికి కిలారి రోశయ్యను నియమించారు. పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా అంబటి మురళి, కందుకూరుకు బుర్రా మధుసూదన్ యాదవ్, గంగాధర నెల్లూరు (జీడీ నెల్లూరు)కు కల్లత్తూర్ కృపాలక్ష్మిని నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఓ పత్రికటన విడుదల చేసింది.

మాటకు మించి సాయం

ప్రతి అడుగులో అన్నదాతకు తోడుగా నిలబడ్డాం: సీఎం జగన్

- రూ.50 వేలే ఇస్తామని చెప్పినా ప్రతి ఒక్కరికీ రూ.67,500 ఇచ్చాం
- అన్నదాతలకు ఈ ఐదేళ్లలో రూ.1.85 లక్షల కోట్ల మేర ప్రయోజనం చేకూర్చాం
- వైఎస్సార్ రైతు భరోసా మూడో విడతగా 53.58 లక్షల కుటుంబాలకు రూ.1,078.36 కోట్లు
- సున్నా వడ్డీ రాయితీ కింద 10.79 లక్షల మందికి మరో రూ.215.98 కోట్లు
- క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి జమ చేసిన సీఎం జగన్


వైఎస్సార్ రైతు భరోసా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: అన్నదాతల కష్టం తెలిసిన ప్రభుత్వంగా ఈ ఐదేళ్లలో ప్రతి అడుగూ రైతులు, రైతు కూలీలు బాగుండాలని మనసా వాచా కర్మణా వేస్తూ వచ్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ప్రగాఢంగా విశ్వసిస్తూ విత్తనం నుంచి పంట విక్రయం వరకూ అన్ని విధాలుగా చేయి పట్టుకుని నడిపించామన్నారు. ప్రతీ పథకాన్ని పేద రైతు కుటుంబాలకు అందుబాటులోకి తెచ్చి సంక్షేమ ఫలాలన్నీ అందించామని, రాష్ట్రంలో ఐదేళ్లుగా మాత్రమే ఇలా జరుగుతోందని గుర్తు చేశారు. ఎన్ని కష్టాలు ఎదురైనా చెప్పిన సమయానికి చెప్పినట్లుగా రైతన్నలకు భరోసా కల్పిస్తూ వ్యవసాయాన్ని పండగ చేసిన ప్రభుత్వం ఇదేనని, భవిష్యత్‌లోనూ ఇదే రీతిలో అండగా నిలిచి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా వరుసగా ఐదో ఏడాది మూడో విడత కింద ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున 53.58 లక్షల మందికి రూ.1,078.36 కోట్ల పెట్టుబడి సాయంతో పాటు 10.79 లక్షల మందికి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద రూ.215.98 కోట్లు కలిపి మొత్తం 64.37 లక్షల మంది ఖాతాలకు రూ.1,294.34 కోట్లను బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్ బటన్ నొక్కి నేరుగా జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

హామీ కంటే మిన్నగా..

వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా రూ.12,500 చొప్పున నాలుగేళ్లలో ప్రతి రైతు కుటుంబానికి రూ.50 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చాం. ఇచ్చిన హామీ కంటే మిన్నగా రూ.12,500 బదులు ఏటా రూ.13,500 చొప్పున అందచేశాం. రూ.50 వేలకు బదులు ఐదేళ్లలో ప్రతి రైతు కుటుంబానికి రూ.67,500 చొప్పున లబ్ధి చేకూర్చాం. ఇవాళ జమ చేస్తున్న పెట్టుబడి సాయంతో కలిపి ఐదేళ్లలో 53.58 లక్షల రైతు కుటుంబాలకు మొత్తం రూ.34,288 కోట్లు పంటలు వేసే సమయంలో పెట్టుబడి సాయంగా అందించాం. ప్రతి రైతన్నకు పెట్టుబడి సాయంగా డబ్బులు ఇవ్వడమే కాకుండా సున్నా వడ్డీని కూడా వర్తింపజేస్తూ రూ.లక్ష వరకు పంట రుణాలను అందిస్తున్న కార్యక్రమం కూడా మన ప్రభుత్వ హయాంలోనే జరుగుతోంది. గత ప్రభుత్వం 39.07 లక్షల మంది రైతులకు ఎగ్గొట్టిన బకాయిలతో కలిపి 84.67 లక్షల మంది అన్నదాతలకు సున్నా వడ్డీ రాయితీ కింద దాదాపు రూ.2,051 కోట్లు అందించాం.

మాఫీ పేరుతో బాబు మోసాలు..

2014 ఎన్నికల సమయంలో రూ.87,612 కోట్ల రైతుల రుణాలన్నీ బేషరతుగా మాఫీ చేస్తానన్న చంద్రబాబు తీరా గద్దెనెక్కిన తర్వాత ఎంత దారుణంగా మోసగించారో ఒక్కసారి గుర్తు తెచ్చుకోవాలని కోరుతున్నా. బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారం ఇంటికి రావాలంటే బాబు సీఎం కావాలని పబ్లిసిటీ చేసి ఆ తరువాత వంచనకు పాల్పడ్డారు. చివరికి ఆ రూ.87,612 కోట్లపై సున్నావడ్డీని కూడా ఎగ్గొట్టాడు. ఐదేళ్లలో దాదాపు రూ.30 వేల కోట్లు ఆ వడ్డీలకే అవుతుంది. ఆయన ఎగ్గొట్టిన సున్నా వడ్డీ బకాయిలను కూడా మనమే ఇచ్చాం. ఐదేళ్లలో ఒక్క వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ పథకం ద్వారానే రైతుల చేతుల్లో రూ.34,288 వేల కోట్లు పెట్టాం. ధాన్యం కొనుగోలు కోసం మరో రూ.65 కోట్లు వెచ్చించాం. ఇలా వివిధ పథకాల ద్వారా అన్నదాతల సంక్షేమాన్ని కాంక్షిస్తూ వ్యవసాయ రంగం కోసం ఐదేళ్లలో రూ.1.85 లక్షల కోట్లు ఖర్చు చేసిన పరిస్థితి కళ్లెదుటే కనిపిస్తోంది.

బాబు గ్రాఫిక్స్ పెట్టుబడులు.. జగన్ రియల్ పెట్టుబడులు

కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ గణాంకాల్లో బట్టబయలైన బాబు గ్రాఫిక్స్ మాటల బురిడీ

బాబు హయాంలోకంటే సీఎం జగన్ హయాంలో రాష్ట్రంలో 3 రెట్లు పెరిగిన పెట్టుబడులు



సాక్షి, అమరావతి: చంద్రబాబు పాలన : ఓ కంప్యూటర్.. అందులో పెద్ద పెద్ద కంపెనీల పేర్లు, లోగోలు.. వాటి గ్రాఫిక్స్.. ఓ వంద అంకెలు, నలభై గీతలు.. వంద అబద్ధాలు. అన్నీ భూతద్దంలో చూపిస్తారు. వినడానికి, గ్రాఫిక్స్ చూడటానికి అబ్బో అనిపిస్తాయి. వాస్తవంగా వచ్చే పెట్టుబడులు సున్నా. పెట్టుబడులన్నీ కాగితాలకు, కంప్యూటర్లకే పరిమితం. సీఎం వైఎస్ జగన్ పాలన : చంద్రబాబు గ్రాఫిక్స్ లాంటి టక్కుటమారాలేమీ ఉండవు. అంతా వాస్తవికత. వచ్చే పెట్టుబడులే కాగితాల్లో కనిపిస్తాయి. అవే ప్రజలకు చేరతాయి. వాస్తవంగా నూరు శాతం పెట్టుబడులతో రాష్ట్రంలో పరిశ్రమలు వస్తాయి. కాగితాల్లో ఉన్న పెట్టుబడులే పరిశ్రమలుగా రూపుదిద్దుకొని ప్రజల ముందు నిలుస్తాయి. .. అందుకే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో రికార్డు స్థాయిలో పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వస్తున్నాయి. గత చంద్రబాబు ప్రభుత్వంతో పోలిస్తే గడిచిన నాలుగున్నర ఏళ్లలో పెట్టుబడులు మూడు రెట్లు పెరిగాయి. ఈ విషయం వెల్లడించింది స్వయానా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ. ఆ శాఖకు చెందిన డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఫర్ ఇండ్రస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) వెల్లడించిన వివరాల ప్రకారం.. 2014–18 సంవత్సరాల మధ్య కాలంలో (చంద్రబాబు పాలన) రాష్ట్రంలోకి వాస్తవంగా వచ్చిన పెట్టుబడులతో పోలిస్తే 2019 నుంచి 2023 జూన్ వరకు (వైఎస్ జగన్ పాలన) వచ్చిన పెట్టుబడులు 226.9 శాతం అధికంగా వచ్చాయి. 2014–18 క్యాలెండర్ ఇయర్ ప్రకారం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వాస్తవ రూపంలోకి వచ్చి ఉత్పత్తిని ప్రారంభించిన పరిశ్రమల పెట్టుబడులు కేవలం రూ.32,803 కోట్లు మాత్రమే. ప్రస్తుత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో రూ.1,00,103 కోట్ల పెట్టుబడులు వాస్తవరూపం దాల్చాయి. చంద్రబాబు నాయుడు పెట్టుబడుల సదస్సు పేరుతో ప్రతి ఏటా హడావుడి చేసి లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చేశాయని చెప్పిన వార్తల్లో వాస్తవం ఏమాత్రం లేదని ఈ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. చంద్రబాబు హయాంలో వివిధ పెట్టుబడుల సదస్సుల ద్వారా రూ.18.87 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు ఉత్తుత్తి ఒప్పందాలు కుదుర్చుకున్నారన్న విషయం సుస్పష్టమైంది.

తరలి వస్తున్న దిగ్గజ సంస్థలు

చంద్రబాబుకు భిన్నంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎటువంటి ప్రచార ఆర్భాటాలు చేయకుండా పరిశ్రమలకు అన్ని విధాలా చేయూతనిస్తున్నారు. సీఎం జగన్ సహకారం అందించడంతో రిలయన్స్, అదానీ, టాటా, బిర్లా, హెచ్‌యూఎల్, బ్లూస్టార్, డైకిన్, ఇన్ఫోసిస్ వంటి అనేక దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయి. సాధారణంగా దేశంలో పెట్టుబడుల సదస్సులోజరిగే ఒప్పందాల్లో 16 నుంచి 17 శాతం మాత్రమే వాస్తవ రూపంలోకి వస్తాయి. కానీ విశాఖ పెట్టుబడుల సదస్సు జరిగి ఏడాది కాకుండానే 19 శాతం పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చేశాయి. జీఐఎస్‌లో మొత్తం రూ.13.11 లక్షల కోట్ల విలువైన 386 ఒప్పందాలు జరగ్గా రూ.2.46 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన పరిశ్రమల పనులు వేర్వేరు దశల్లో ఉన్నాయి.

టీ–జే ఫ్లాప్ షో!

- తుస్సుమన్న టీడీపీ–జనసేన (టీజే) తొలి బహిరంగ సభ
- 6 లక్షల మంది వస్తారని ఊదరగొట్టిన నేతలు
- కిందా మీదా పడి 40–50 వేల మందికే పరిమితం
- పొత్తుకు తమ మద్దతు లేదని స్పష్టం చేసిన ఇరు పార్టీల కేడర్


సభకు అరకొరగా హాజరైన టీడీపీ-జనసేన కార్యకర్తలు, నాయకులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు/ సాక్షి, భీమవరం: జనాదరణ లేక టీడీపీ–జనసేన (టీజే) తొలి బహిరంగ సభ తుస్సుమంది. అంతా.. ఇంతా.. నభూతో.. అన్నట్లు నాలుగైదు రోజులుగా ఊదరగొట్టిన ఎల్లో మీడియా ఇప్పుడు ఈ సభకు వచ్చిన జనం మాటెత్తడం లేదు. టీడీపీ–జనసేన పొత్తుకు జనం మద్దతును ఈ సభతో చాటిచెబుతామంటూ ఇరు పార్టీల అధినేతలు హడావుడి చేశారు. కేడర్ నిరసనల్ని, మనోభావాల్ని లెక్కచేయకుండా చంద్రబాబు, పవన్‌ల వ్యక్తిగత అ'జెండా'తో నిర్వహించిన సభకు రాష్ట్రం నలుమూలల నుంచి ఆరు లక్షల మంది తరలివస్తారంటూ ఎల్లో మీడియాలో మోత మోగించారు. తాడేపల్లిగూడెం సమీపంలో 22 ఎకరాల ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేసుకుంటే.. తీరా టీడీపీ–జనసేన పార్టీల కేడర్ నిరాదరణతో కాస్తా ఫ్లాప్ షోగా మిగిలింది. ఈ పొత్తు తమకు అంగీకారం కాదని స్పష్టం చేస్తూ నాయకులు, కిందిస్థాయి కేడర్ సభను తుస్సుమనిపించారు. ప్రజలు పొత్తుకు బ్రహ్మరథం పడతారని చంద్రబాబు, పవన్‌లు ఎన్నో ఆశలు పెట్టుకుంటే.. టీడీపీ–జనసేన సంయుక్తంగా నిర్వహించిన తొలి బహిరంగ జెండా సభకు వారి లక్ష్యంలో పది శాతం మంది కూడా రాకపోవడం ఆ పార్టీల భవితవ్యాన్ని ప్రశ్నార్థకంగా మార్చింది. సభకు హాజరైన వారి సంఖ్య చూసి ఆ పార్టీల అగ్ర నేతలు విస్తుపోయారు. గ్యాలరీల్లో సగం పైగా కుర్చీలు ఖాళీగా కనిపించడంతో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు కంగుతిన్నారు.

టీ–జే పార్టీ నేతల్లో నైరాశ్యం

టీడీపీ–జనసేన నిర్వహిస్తున్న తొలి ఉమ్మడి సభకు తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడు వద్ద జాతీయ రహదారి బైపాస్ పక్కనే ఉన్న 22 ఎకరాల మైదానాన్ని ఎంచుకున్నారు. 500 మంది కూర్చోవడానికి వీలుగా వేదికతోపాటు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు వేర్వేరుగా హెలికాప్టర్‌లలో రానుండటంతో అక్కడకు సమీపంలో రెండు హెలిప్యాడ్‌లు ఏర్పాటు చేశారు. వేదిక, హెలి ప్యాడ్‌లు, వీవీఐపీల రెస్ట్ రూమ్‌లు, పార్కింగ్‌కు ఏడు ఎకరాలు పోగా మిగిలిన 15 ఎకరాల్లో కార్యకర్తల కోసం 22 గ్యాలరీలు సిద్ధం చేశారు. ఒక్కో గ్యాలరీలో 1,500 కుర్చీల చొప్పున 22 గ్యాలరీల్లో 33 వేల కుర్చీలు వేశారు. మొత్తం కుర్చీలన్నీ నిండిపోయి 15 ఎకరాల ప్రాంగణం కిక్కిరిసిపోతే దాదాపు 60 వేల మంది హాజరైనట్లు లెక్క. అయితే సభ ప్రారంభం నుంచి చివరిదాకా సగం గ్యాలరీలు ఖాళీగానే ఉన్నాయి. వాస్తవానికి ఆరు లక్షల మంది జనం వస్తారని టీడీపీ–జనసేన నేతలు చెప్పారు. అయితే అది సాధ్యం కాదని వారికీ తెలుసు. అందుకే తక్కువ స్థలం ఉన్న చోట సభ నిర్వహించి, జనం కిక్కిరిసిపోతే.. దానినే కొండంతలు చేసి చూపాలన్న టీడీపీ, జనసేన అగ్రనేతల పన్నాగం బెడిసికొట్టింది. మొత్తంగా 40–50 వేల మంది కూడా హాజరు కాకపోవడం ఆ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది.

జిల్లా వార్తలు

మార్చి 5న పండితాపురం సంత వేలం

కామేపల్లి: రాష్ట్రంలోనే పేరున్న కామేపల్లి మండలం కొమ్మినేపల్లి(పండితాపురం) గ్రామపంచాయతీ పరిధిలో శ్రీ కృష్ణప్రసాద్ పశువుల వారాంతపు సంత నిర్వహణకు మార్చి 5న వేలం నిర్వహించనున్నట్లు జీపీ ప్రత్యేకాధికారి రవీందర్, కార్యదర్శి గుగులోత్ నెహ్రూ తెలిపారు. ఏడాది పాటు అప్పగించేందుకు నిర్వహిస్తున్న వేలంలో పాల్గొనేందుకు పీసా చట్టం ప్రకారం పంచాయతీ పరిధిలోని ఎస్టీలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలం నిర్వహించే రోజు ఉదయం 11 గంటల్లోపు ధరావతు సొమ్ము రూ.30 లక్షలు, సాల్వేన్సీ కింద రూ.5 లక్షలను డీడీ లేదా నగదు రూపేణా పంచాయతీ కార్యదర్శి పేరున చెల్లించాలని సూచించారు.

పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలి

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల పదో తరగతి విద్యార్థుల వార్షిక పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని విజయం సాధించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఆందోళనకు గురికాకుండా పరీక్ష రాయాలని, తద్వారా మెరుగైన ఫలితాలు సాధించొచ్చని తెలిపారు. కాగా, శుక్రవారం నుంచి మొదలయ్యే ప్రీఫైనల్ పరీక్షల విద్యార్థుల సామర్థ్యాలను ఉపాధ్యాయులు గుర్తించి వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో మొత్తం 2,591 మంది విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరుకానున్నారని పీఓ వెల్లడించారు.

శాశ్వత నిత్యాన్నదానానికి వితరణ


దాతలకు రశీదు ఇస్తున్న అధికారులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీకి చెందిన భక్తులు బుధవారం విరాళం అందచేశారు. విజయవాడలోని ముత్యాలంపాడుకు చెందిన పంచాలవరపు కామేశ్వరశర్మ ఆలయాధికారులకు రూ.1,12,000ను అందజేయగా వారు స్వామి దర్శనం చేయించారు. కార్యక్రమంలో ఆలయాధికారులు, దాతల కుటుంబీకులు పాల్గొన్నారు.

క్షణాల్లో మిర్చి నాణ్యత!

- అందుబాటులోకి పరీక్ష యంత్రాలు
- సాగు–బాగు ప్రాజెక్టులో భాగంగా సిద్ధం
- ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో ఏర్పాటు
- తేమ, ఘాటు, రంగు ఆధారంగా ధర పొందే అవకాశం


మిర్చి శాంపిళ్లను పరీక్ష కోసం అందజేస్తున్న రైతులు

ఖమ్మంవ్యవసాయం: మిర్చి నాణ్యత పరీక్ష యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. సాగు–బాగు కార్యక్రమంలో బాగంగా డిజిటల్ గ్రీన్ సంస్థ ఈ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం వాణిజ్య పంటల్లో డిమాండ్ ఉన్న పంటగా మిర్చికి పేరుంది. పత్తి, వరి, అపరాలు వంటి పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా మద్దతు ధరలను ప్రకటించి కొనుగోలు చేస్తుంది. ఈ పంటల కొనుగోళ్లలో పలు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తుంటారు. మసాలా దినుసు పంటైన మిర్చికి వివిధ కారణాలతో మద్దతు ధర ప్రకటించటం లేదు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ల డిమాండ్ ఆధారంగా ఈ పంటకు వ్యాపారులు ధర నిర్ణయించి కొనుగోళ్లు చేస్తున్నారు. అనాదిగా మిర్చి పంట నాణ్యత కొలిచే యంత్రాలు లేకపోవడంతో వ్యాపారులు తమ అనుభవాన్ని ప్రామాణికంగా చేసుకొని పంట నాణ్యత, రంగు ఆధారంగా ధర నిర్ణయిస్తున్నారు. పంట నాణ్యతను కొలిచే యంత్రాలు లేకపోవటం, ప్రభుత్వం మద్దతు ధర కూడా లేకపోవటం వ్యాపారులకు కలిసొచ్చిన అంశం. ఇక వ్యాపారులు నిర్ణయించిన ధరకే రైతులు విక్రయిస్తుండడంతో వారికి నష్టాలు తప్పడం లేదు.

'సాగు–బాగు'తో ధర పెరిగేనా..?

ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు ధర కల్పనలో అవరోధాలను అధిగమించేందుకు ఇటీవల పలు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ క్రమంలో సాగు–బాగు కార్యక్రమంలో డిజిటల్ గ్రీన్ సంస్థ మిర్చి నాణ్యత యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం మిర్చి ధర రూ. 20 వేలకు పైగా పలుకుతోంది. పంటకు ధర ఉన్న సమయంలో నాణ్యతా ప్రమాణాల ఆధారంగా కొనుగోళ్లు జరిగితే రైతులకు మేలు జరిగే అవకాశం ఉంది. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం సాగు–బాగు ప్రాజెక్టులో భాగంగా మిర్చి నాణ్యతా పరీక్షలు చేయించి, వాటి ఆధారంగా పంటకు ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని ఆయా సంస్థలను ఆహ్వానిస్తోంది. గతేడాది ఈ ప్రక్రియ పలు ప్రాంతాల్లో సత్ఫలితాలు ఇవ్వడంతో ఈ సంవత్సరం కూడా మరిన్ని ప్రాంతాలకు విస్తరింపజేసేలా కృషి కొనసాగుతోంది.

ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అమలు

సాగు – బాగు కార్యక్రమంలో భాగంగా మిర్చి నాణ్యత పరీక్షలను ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో నిర్వహించి వాటి ఆధారంగా రైతులకు మేలైన ధర కల్పించటం కోసం ప్రభుత్వం డిజిటల్ గ్రీన్ సంస్థ ద్వారా కృషి చేస్తోంది. రైతులు పండించిన మిర్చి పంట తేమ, రంగు, ఘాటు వంటి అంశాలను సాంకేతిక పరిజ్ఞానంతో పరీక్షలు నిర్వహించి అందుకు అనువైన ధర కల్పించేందుకు ప్రక్రియను నిర్వహిస్తున్నారు. అంతేగాక పంట నాణ్యతా ప్రమాణాల ధ్రువీకరణ పత్రాలను అందించేందుకు కూడా డిజిటల్ గ్రీన్ సంస్థ సిద్ధంగా ఉంది. ఆ ధ్రువపత్రాల ఆధారంగా రైతులు వ్యాపార సంస్థల్లో అధిక ధర పొందే అవకాశం ఉంది. దీనికి తోడు డిజిటల్ గ్రీన్ సంస్థ పలు సంస్థలను కూడా మిర్చి కొనుగోళ్లకు ఆహ్వానిస్తుంది. ఇప్పటికే 13 ట్రేడింగ్ కంపెనీలు తమకు 300 టన్నుల మిర్చి అవసరమని చెబుతూ కొనుగోళ్లకు ముందుకొచ్చాయి.

రైతు వేదికల్లో ఏర్పాటు

రైతు వేదికలను కేంద్రాలుగా ఎంచుకొని మిర్చి నాణ్యత పరీక్షలను నిర్వహించాలని డిజిటల్ గ్రీన్ సంస్థ నిర్ణయించింది. మిర్చి పండించే ప్రాంతాల్లో ఉన్న రైతు వేదికల్లో ఈ యంత్రాలను అందుబాటులో ఉంచాలని సన్నాహాలు చేస్తున్నారు. అందుకు అనుగుణంగా సంస్థకు చెందిన డేటా ఎంట్రీ ఆపరేటర్లు, పలువురు అనుభవజ్ఞులైన రైతులకు శిక్షణనిచ్చే ప్రక్రియను కూడా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లోని పలు రైతు వేదికల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కొందరు మిర్చి రైతులకు ఈ యంత్రాల నిర్వహణపై శిక్షణలు కూడా ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లాలోని కొరివి, మహబూబాబాద్ రూరల్ ప్రాంతాల్లోని పలువురుకి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులు మిర్చి శాంపిళ్లను తీసుకొస్తే 5 నిమిషాల్లో తేమశాతం పరీక్షలు జరిపి వెంటనే వివరాలను వెల్లడించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

తేమ యంత్రాలు, కెమికల్ మిషన్లు..

మిర్చిలో తేమ శాతాన్ని పరీక్షించే యంత్రాలు, ఘాటు, రంగును కొలిచే కెమికల్ మిషన్లను డిజిటల్ గ్రీన్ సంస్థ ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఖమ్మం జిల్లాకు రెండు తేమశాతం కొలిచే యంత్రాలు అందుబాటులోకి రాగా, మహబూబాబాద్ జిల్లాకు ఒక మిషన్ అందుబాటులోకి వచ్చింది. ఘాటు, రంగును కొలిచే మిషన్లు కూడా అందుబాటులోకి తీసుకువచ్చే పనిలో సంస్థ ఉంది. ఈ యంత్రాల ద్వారా 10 నుంచి 12 శాతం తేమ ఉన్న మిర్చిని బెస్ట్ క్వాలిటీగా గుర్తించవచ్చు. ఈ మిర్చిని విక్రయించుకుంటే డిమాండ్ మేరకు ధర వచ్చే అవకాశం ఉంటుంది. లేదంటే కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ పెట్టుకునేందుకు ఈ మిర్చికి అర్హత ఉంటుంది. ఇక 13 నుంచి 15 వరకు తేమశాతం ఉన్న మిర్చిని విక్రయించుకునే అవకాశం ఉంది. అంతకు పైగా తేమ శాతం ఉంటే మాత్రం ఆరబెట్టాల్సి ఉంటుంది. అలాగే బస్తాల్లో నింపి ఉంచితే మిర్చి దెబ్బతినే అవకాశం ఉంటుంది.


మిర్చిలోని తేమ శాతాన్ని పరీక్ష చేసే విధానాన్ని వివరిస్తున్న కో-ఆర్డినేటర్

శాంపిళ్లు తీసుకొస్తే వెంటనే పరీక్ష



గ్రామాల్లో మిర్చి శాంపిళ్లను సమీకరించి ఉంచితే ఆయా ప్రాంతాల్లోని రైతు వేదికల వద్దకు చేరుకొని తేమ పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో రైతులు మిర్చి నాణ్యత పరీక్షలు చేయించుకుంటున్నారు. శాంపిళ్ల ఆధారంగా బయ్యర్లు ధర నిర్ణయించి కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో ఈ ప్రక్రియ నిర్వహిస్తాం.

– యశోద, సాగు–బాగు ప్రాజెక్టు ఖమ్మం, మహబూబాబాద్ ఇన్‌చార్జి

సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

నేడు ఖమ్మంలో అవగాహన సదస్సు


మాట్లాడుతున్న ఎర్నేని రామారావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: సిరిధాన్యాలతో ఆరోగ్యానికి జరిగే మేలుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని కమ్మ మహాజన సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎర్నేని రామారావు తెలిపారు. ఖమ్మంలో బుధవారం ఆయన మాట్లాడుతూ సిరిధాన్యాలతో తయారు చేసే ఆహారం, లాభాలపై గురువారం జరిగే సదస్సులో స్వతంత్ర శాస్త్రవేత్త, ప్రద్మశ్రీ అవార్డు గ్రహీత ఖాదర్‌వలీ పాల్గొని ప్రసంగిస్తారన్నారు. గురువారం సాయంత్రం 4 గంటలకు ఖమ్మంలోని స్వర్ణభారతి కల్యాణ మండపంలో రైతు నేస్తం ఫౌండేషన్, కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యాన జరిగే ఈ సదస్సులో ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. అలాగే, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్లపల్లి వెంకటేశ్వరరావు పలు అంశాలపై మాట్లాడుతారని చెప్పారు. సమావేశంలో కమ్మ మహాజన సంఘం కార్యదర్శి గొడవర్తి నాగేశ్వరరావుతో పాటు నల్లమోతు రఘు, బండి మాధవరావు, డి.గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కోయగూడెం ఓసీలో సింగరేణి డైరెక్టర్ పర్యటన


వ్యూ పాయింట్ నుంచి ఓసీని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

టేకులపల్లి: సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి బుధవారం ఇల్లెందు ఏరియాలోని టేకులపల్లి మండలం కోయగూడెం ఓసీలో పర్యటించారు. ఈ సందర్భంగా గనిలో పని ప్రదేశాలను పరిశీలించిన ఆయన రోజువారీ ఉత్పత్తి, రవాణాపై జీఎం జాన్‌ఆనంద్‌తో సమీక్షించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తిలో అవరోధాలు ఎదురుకాకుండా చూస్తూ వార్షిక లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఆ తర్వాత కాంట్రాక్టు ఉద్యోగులతో మాట్లాడి వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో అధికారులు ప్రహ్లాద్, సౌరభ్ సుమన్, నాగేశ్వరరావు, అంజిరెడ్డి పాల్గొన్నారు.

మేడిగడ్డ, కాళేశ్వరంపై చర్యలేవీ?

- కాంగ్రెస్ నేతల మాటలను ప్రజలు విశ్వసించరు
- బీజేపీ నేతలు ప్రేమేందర్ రెడ్డి, ధర్మారావు


మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి, ధర్మారావు

ఇల్లెందు: మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్టులపై సీబీఐ విచారణ కోరలేదని, ఏ ఒక్కరిపైనా కేసులు పెట్టలేదని, బీఆర్‌ఎస్ అవినీతిపై విచారణ కోరని కాంగ్రెస్ నేతలు.. ఆ పార్టీతో చీకటి ఒప్పందం చేసుకున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, హన్మకొండ మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడా ఊసే ఎత్తడం లేదన్నారు. అధికారం కోసం అడ్డగోలు వాగ్దానాలు చేసిన కాంగ్రెస్.. ఆ హామీలు అమలు చేసే యోచనలో లేదని విమర్శించారు. రైతు రుణమాఫీ అడ్రస్ లేదని, నిరుద్యోగులకు భృతి మాటే ఎత్తడం లేదని, మహిళలకు రూ.2,500 ఇచ్చే పరిస్థితి లేదని అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెబుతారని, తెలంగాణలో 17 సీట్లూ బీజేపీ గెలువటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దేశంలోని పేదలు బీజేపీకి దగ్గరయ్యారని, 22 కోట్ల మంది భారతీయులు శ్రీరామ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని టీవీల ద్వారా వీక్షించారని తెలిపారు. దేశంలో 80 కోట్ల మందికి ఉచిత ఆహారం అందించిన ఘనత మోదీకే దక్కిందన్నారు. దేశంలో మోదీ హవా సాగుతోందని, ఏ పార్టీతో పొత్తు లేకుండా రాష్ట్రంలో 8 మంది ఎమ్మెల్యేలను బీజేపీ గెలుచుకుందని చెప్పారు. సమావేశంలో నాయకులు రంగాకిరణ్, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాళ్ల సోమసుందర్, బలగాని గోపీకృష్ణ, మావునూరి మాధవ్, కొల్లి సంజీవరెడ్డి, మిర్యాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.